

మెదక్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)


నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న జనం (ఫైల్)


నర్సాపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ (ఫైల్)

# కారు జోరు.. విపక్షాలు బేజారు

- ఎన్నికల ప్రచారంలో జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ అస్త్రాలు
- మెదక్, నర్సాపూర్ ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్
- బీఆర్ఎస్ శ్రేణుల్లో రెట్టింపైన ఉత్సాహం

మెదక్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ మెదక్, నర్సాపూర్‌లో నిర్వహించిన సీఎం ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. అంచనాకు మించి ప్రజలు భారీగా తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. బస్సులు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు, ట్రాలీలు, బైకుల్లో ప్రజలు భారీగా తరలివచ్చారు. సీఎం రాకముందే సభా ప్రాంగణాలు మొత్తం జనంతో నిండిపోయాయి. మెదక్ జిల్లాలో గులాబీ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నారు. కారు టాప్ గేర్‌లో లక్ష్యం వైపు పరుగులు పెడుతున్నది.

### ఇంటింటికీ ప్రభుత్వ పథకాల ప్రచారం

మెదక్ జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికల కదన రంగంలోకి దిగి జనంలోకి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే అధినేత కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించగా, అప్పటి నుంచే గులాబీ అభ్యర్థులు రంగంలోకి దిగారు. నిత్యం జనంతో మమేకమవుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమను ఆశీర్వదిస్తే రాబోయే ఐదేండ్లలో నియోజకవర్గాలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామంటూ మద్దతు కూడగడుతున్నారు. మెదక్ జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలకు మెదక్ సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థిగా పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సునీతారెడ్డిని అభ్యర్థులుగా పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో వారు జనక్షేత్రంలోకి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

### ప్రజా ఆశీర్వాద సభతో పద్మ హ్యాట్రిక్ పక్కా

ఈ నెల 15న మెదక్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభతో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం పక్కా అయ్యింది. ఇప్పటికే రెండుసార్లు గెలిచిన ఆమె మెదక్ నియోజకవర్గ రూపురేఖలను మార్చారు. మునుపెన్నడూ లేనివిధంగా మెదక్ సభకు జనం పోటెత్తడంతో పద్మ గెలుపు ఖాయమైంది. ఈ జనాన్ని చూస్తుంటే మెదక్ జిల్లా సభలా అనిపించింది. ఇంత పెద్దఎత్తున జనం వచ్చి పద్మాదేవేందర్‌రెడ్డిని ఆశీర్వదించారు. ఇక ఆమె భారీ మెజార్టీతో గెలిచినట్టే లెక్క అంటూ బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మెదక్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో మెదక్ నియోజకవర్గ గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, మ్యాడం బాలకృష్ణ, బీజేపీ నుంచి నందు జనార్దన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇక పద్మాదేవేందర్‌రెడ్డి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### నర్సాపూర్ అడ్డాలో సునీతమ్మదే గెలుపు..

నర్సాపూర్‌లో సీఎం సభ తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి గెలుపు నల్లేరుపై నడక అన్నది స్పష్టం అవుతున్నది. జిల్లాలో రెండు స్థానాలు కైవసం చేసుకుని తీన్మార్ మోగించబోతున్నది. ఎక్కడ చూసినా ప్రచార కార్యక్రమాలతో గులాబీ శ్రేణులు అభ్యర్థులు గ్రామాలను చుట్టేస్తుంటే, విపక్ష పార్టీల్లో ఆ సందడి కనిపించడంలేదు. నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి తోడుగా కాంగ్రెస్ పార్టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి సురేశ్‌నాయక్ సీఎం కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడంతో బీఆర్ఎస్‌కు అదనపు బలం చేకూరింది. ఇప్పటికే నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు హరికృష్ణతో పాటు పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతారెడ్డి గెలుపు కోసం కృషి చేస్తున్నారు.

### కేసీఆర్ రాకతో గులాబీ క్యాడర్‌లో నూతనోత్సాహం

మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలకు సీఎం కేసీఆర్ రాకతో గులాబీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. పార్టీ శ్రేణులు, అభిమానులు కాలినడకన సైతం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు పోటెత్తారు. కార్యకర్తలు, అభిమానులు సొంత ద్విచక్ర వాహనాలు, సొంత వాహనాల్లో వచ్చి కేసీఆర్‌కు జేజేలు పలికారు. మరోపక్క మెదక్, నర్సాపూర్ సభలు ఊహించిన దానికంటే సూపర్ సక్సెస్ అయ్యాయి. రైతుబంధు ఎకరానికి రూ.16 వేలకు వచ్చే ఐదేండ్లలో క్రమంగా పెంపు, సౌభాగ్యలక్ష్మి పేరుతో బీపీఎల్ కుటుంబాలకు చెందిన అర్హులైన మహిళలకు కొత్తగా నెలకు రూ.3వేల గౌరవ భృతి, అర్హులైన పేద కుటుంబాలు, అక్రిడిటెడ్ జర్నలిస్టులకూ రూ.400కే వంట గ్యాస్ సిలిండర్, కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా రూ.15 లక్షలు, జర్నలిస్టులకు రూ.15 లక్షల వరకు నగదు రహిత వైద్యబీమా, పేద కుటుంబాలకు రూ.5 లక్ష ల కేసీఆర్ బీమా, సన్నబియ్యం, రూ.5016కు ఆసరా పింఛన్లను పెంపును మార్చి నుంచి దశలవారీగా అమలు చేస్తామని సభలో కేసీఆర్ ప్రకటించగానే ప్రజలు జేజేలు కొట్టారు.

# ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్
- ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది నియామకం
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ తెలిపారు. శుక్రవారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ సమక్షంలో మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి, పూర్తి చేశారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్ ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మెదక్(34), నర్సాపూర్(37) అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామన్నారు. విడతల వారీగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కలెక్టర్ రాజర్షి షా, పరిశీలకుడు పృథ్వీరాజ్ దృష్టికి తీసుకొచ్చారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారన్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలు, ఒక దివ్యాంగుల, యువతతో కూడిన పోలింగ్ బృందాలు ఎంపిక చేసినట్లు వివరించారు. సమావేశంలో జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారులు, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, రిటర్నింగ్ అధికారులు అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాసులు, ఈడీఎం సందీప్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి కృష్ణమూర్తి, మ్యాన్ పవర్ నోడల్ అధికారి రాజేశ్వర్ రెడ్డి, మైన్స్ ఏడీ జయరాజ్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుల పృథ్వీరాజ్ బీపీ


పొడ్చన్‌పల్లి గిరిజన తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి


ఎల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

# అభివృద్ధిని చూసి ఓటేయాలి

- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు
- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి
- పాపన్నపేట మండలంలో ఎన్నికల ప్రచారం

పాపన్నపేట, నవంబర్ 17: కాంగ్రెస్‌కు నమ్మి ఓటు వేస్తే కరెంట్ కష్టాలు పాలవుతామని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లాపూర్, శానాయిపల్లి, తుమ్మలపల్లి, పొడ్చన్‌పల్లి, పొడ్చన్‌పల్లి తండా, నాగ్సాన్‌పల్లి, శేరిపల్లి, గాంధారి పల్లి, జైపురం, అన్నారం, అబ్లాపూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే అసైన్‌మెంట్ భూముల నిబంధనలను సులభతరం చేసి భూ హక్కులు కల్పిస్తామన్నారు. పోడు భూములకు సైతం భూ హక్కులు కల్పించనున్నామన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఎన్నికల్లో గెలవలేరన్నారు. కాంగ్రెస్‌లో ఎప్పటికీ కుర్చీల కొట్లాట ఉంటుందన్నారు. గతంలో మైనంపల్లి కేవలం గిన్నెలు, గ్లాసులు ఇచ్చిండన్నారు. నీళ్లు లేనప్పుడు బోర్లు ఎందుకు వేయలేదని, ఇప్పుడెందుకు వేస్తున్నాడని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మవద్దని, నమ్మితే నట్టేట మునుగుతామని తిరిగి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఆమె వెంట మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు సోములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుమ్మరి జగన్, రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు సుదర్శన్, లింగారెడ్డి, దానయ్య, నవీన్, రాణి కిష్టయ్య, శ్రీకాంత్, విజయ తిరుపతి రెడ్డి, ప్రవంతి శ్రీనివాస్, సబితా రవీందర్, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, డైరెక్టర్లు మనోహర్, వెంకటేశం, సాయిలు, పెంటయ్య, నాయకులు చావ బాపారావు, దుర్గయ్య, సాయిరెడ్డి, కిష్టారెడ్డి రఘు, భూషణం తదితరులు పాల్గొన్నారు.